
# తప్పటడుగు

- డి. కామేశ్వరి

"మేడమ్ మీకో ఫోనొచ్చింది. స్కూలు ప్యూను చెప్పగానే పిల్లల నోట్సులు కామన్ రూములో కూర్చుని దిద్దుతున్న లలిత లేచి హెడ్‌మిస్ట్రెస్ గదిలోకి వెళ్లింది. కాగితాలు చూస్తున్న మిసెస్ కాత్యాయని "మీవారట" అంది ముభావంగా. లలిత మొహం ఒక్క క్షణంలో మ్లానమైంది. ఫోనెత్తి "హలో" అంది గంభీరంగా. "లలిత నేను, ప్లీజ్ ఫోను పెట్టేయకు, నా మాట కాస్త విను" అర్థిస్తున్న స్వరంతో అన్నాడు శ్రీరాం. "రాంగ్ నంబర్" అంటూ ఫోను పెట్టేసి వెనుదిరిగింది. కాత్యాయని ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూసి తలదించుకుంది. లలిత గుమ్మం దాటక ముందే మళ్లీ మోగిం ది. "లలితా, నీకే ఫోను, మాట్లాడి వె ళ్లు, లేకపోతే నాకనవస రంగా డిస్ట్ర బెన్స్" అంది




కాస్త అప్రసన్నంగా. ఫోను తీసి ఎర్ర బడిన మొ హంతో "చెప్పండి" అంది కటువుగా...! "లలితా, ప్లీజ్ నాకు ఒక్కసారి మాట్లాడే అవకాశం ఇవ్వు. నేను చెప్పేది విను-" చెప్పడం, వినడం యిదివరకే జరిగింది. యింకేం కొత్తగా చెప్పడానికి ఏంలేదు, ప్లీజ్ యికమీదట ఫోను చెయ్యకండి". "లలితా! గాభరాగా అన్నాడు- "ఒక్క అవకాశం ఇవ్వు - ఫర్‌గాడ్ సేక్ నేను చెప్పేది విను-" హెడ్‌మిస్ట్రెస్ ఎదురుగా యింకేం మాట్లాడాలో అర్థంగాక "సరే సాయంత్రం ఐదింటికి యింటికి రండి'- అంటూ అడ్రసు చెప్పి ఫోను పెట్టేసింది. కాత్యాయని ఏదో అడగబోయి విరమించుకొంది - లలిత కథంతా తెల్సినా ఆమె చెప్పందే మరీ పర్సనల్ విషయాలు అడగడం అనుచితం అని వూరుకుంది. ఆవిడ మొహంలో సందిగ్ధ భావం చూసి "నామానాన నేను బతుకుదామన్నా మళ్లీ తయారయ్యాడు- జైలు నుంచి విడుదలయ్యాడు -" అంది విరక్తిగా లలిత.

"ఏం అంటాడు!" 'ఏం అంటాడు, మాట్లాడాలి, చెప్పేది విను, ఒక్క అవకాశం ఇవ్వు" ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు ఆవేదనగా అంది.

"లలితా ఆలోచించు బాగా! నీకు యింకా బోలెడి జీవితం వుంది ముందు. నీ పిల్లాడికీ తండ్రి కావాలి. నీవొకర్తివి వాడిని సాకుతూ వంట రిగా బతకా లంటే ముందు ముందు కష్టమవచ్చు - మనిషి మారి, పాత పద్ధతులు వదిలితే ఒక అవకాశం యిచ్చి చూడు -" పెద్దావిడిగా సలహా యిచ్చింది - సాలోచనగా తలపంకించి బయటికి వెళ్లింది లలిత - కామన్ రూములో కూర్చొని పుస్తకాలు ముందేసుకున్నా ఒక్క కాగితం చూడలేకపోయింది - యిప్పుడిప్పుడే మానుతున్న గాయం మళ్ళీ కెలికినట్లయింది.

పెళ్లయ్యాక ఓ రెండేళ్లు ఏం సుఖపడిందో! అంతే! తన కష్టాల కథ మొదలైంది. శ్రీరాం పనిచేస్తున్న కంపెనీ నష్టాల్లో కూరుకుపోయి ఆఖరికి మూతపడింది. జీతాలు లేవు - కంపెనీ తేరుకుంటుందేమోనన్న ఆశతో ఎదురుచూసిన ఉద్యోగులందరూ వీధినబడ్డారు. కంపెనీ మూతపడింది. ఆ తరువాత ఏడాది ఎలా గడిచిందో తలుచుకుంటే వళ్లు జలదరిస్తుంది లలితకి. శ్రీరాం చూడని పేపరు లేదు - పెట్టని అప్లికేషన్ లేదు, పిలిచిన, పిలవని ఆఫీసుల చుట్టూ ఉద్యోగం కోసం తిరిగాడు - అతనిదేం పెద్ద క్వాలిఫికేషన్ కాదు - ఉత్తి బి.కాం. కంపెనీలో గుమాస్తాగా చేరి మంచి పేరు తెచ్చుకొని అకౌంటెంట్ స్థాయికెదిగాడు - ఆ స్థాయిలో అతనికేం ఉద్యోగం దొరకలేదు - తక్కువ స్థాయి దొరకలేదు - జీతమివ్వని మూడు నెలల్లోనే నిల్వ డబ్బు హరించింది. మిగతా మూడు నెలలు అప్పులు యిచ్చినవారందరి దగ్గర చేశాడు. తరువాత వున్న కాస్త బంగారం, వెండి రెండు నెలల్లో హరించాయి. యిటు అటు ఆదుకునే వారెవరూ లేరు- యిస్తే పుచ్చుకునే స్తోమత వున్నవారే. అక్కడికీ ఓసారి వాళ్లు, ఓసారి వీళ్లు యివ్వడం అయింది చాతనయినంత - ఆరు నెలలు గడిచేసరికి తిండికి మొహం వాచే స్థితి వచ్చేసింది. ఓ స్నేహితురాలి సాయంతో ఓ ప్రైవేట్

స్కూల్లో చేరింది - పదిహేను వందలు రాయించుకుని ఎనిమిది వందలు చేతిలో పెట్టేవారు - నదిలో కొట్టుకుపోతున్నవారికి గడ్డిపోచ ఆధారం దొరికినా సంతోషమే! సాయంత్రం నాలుగు ట్యూషన్లు కుదుర్చుకుని ఒంటి గది యింటికి మారి, ఓ పూట తిని ఓ పూట తినక చావలేక బతకలేక బతికే బ్రతుకు ఓ పక్క, ఉద్యోగం లేక భార్య సంపాదనతో బతికే బతుకు శ్రీరాంలో విచక్షణాజ్ఞానాన్ని హరించివేసింది. యింట్లో నరకం చూపేవాడు. అన్నింటికి తనని తాను తిట్టుకోడం, భార్యని తిట్టడం, వూ అంటే కోపం, అ అంటే కోపం ఏమాటంటే హర్ట్ అవుతాడో... అనుక్షణం కృంగిపోయింది. అటు శ్రీరాం నిరాశ నిస్పృహలు ఆకాశాన్నంటి ఏక్షణాన విరక్తితో ఏం చేస్తాడోనని ఓ పక్క భయం - పోనీ మీరూ నాలుగు ట్యూషన్లు చెప్పరాదా అంటే నీకింద అసిస్టెంట్‌గానా అని ఎత్తిపొడుపు - ఏ చిన్న వ్యాపారం చెయ్యాలన్నా పెట్టుబడి, అదిచ్చే నాధుడుగాని, బ్యాంక్‌లుగాని లేవు - గ్యారంటీ వుండే వెర్రి వెధవలు ఎవరు? ఓ ఏడాదిలా గడిచాక చీకటి తరువాత వెలుగు రాక తప్పదన్నట్టు మంచి రోజులు వచ్చాయి - కంపెనీలో ఐదువేల జీతంకి సేల్స్ మేనేజర్ ఉద్యోగం దొరికింది అంటూ రెండు వేలు అడ్వాన్స్ యిచ్చారు అంటూ యింటికొచ్చాడు - వెయ్యి దేముళ్ళకి నమస్కారాలు పెట్టుకుంది. దేముడి దయతలచాడనుకొంది - కాని, తుఫానుకు ముందు ప్రశాంతత అనుకోలేదు - ఊరి చివర కంపెనీ పేరేదో చెప్పాడు - కెమికల్స్ కంపెనీ డిస్ట్రిబ్యూషన్ చూడాలనేవాడు - నమ్మింది. బ్రీఫ్‌కేసులు పట్టుకుతిరగడం మొదలైంది. డ్రస్సులు కొనుక్కున్నాడు టిప్‌టాప్‌గా వుండాలని - కంపెనీ క్వార్టర్స్ యిచ్చిందన్నాడు మళ్ళీ నెలలో - రెండు గదుల అపార్టుమెంట్‌కి మారారు. సామాన్లు టి.వి, ఫ్రిజ్, గ్యాస్ స్టవులు, గ్రైండర్లు ఒక్కొక్కటి వచ్చి చేరాయి యింట్లో - మూడు నెలలకే స్కూటరిచ్చారు తిరగడానికన్నాడు... యింత త్వరగా యింత తొందరగా యిన్నిన్ని యిచ్చేసే ఆ కంపెనీ నాలుగు కాలాలపాటు చల్లగా వుండాలని కోరింది. ఆరు నెలలకి మొబైలు ఫోను - తనని కాంటాక్ట్ చేయడానికి వాళ్లకిబ్బందిగా వుందని యిచ్చారనగా - అన్నీ నమ్మింది - బ్రీఫ్‌కేసు నిండా నోట్ల కట్టలుండేవి - కంపెనీ సొమ్ము అన్నాడు - ఓసారి బ్రీఫ్‌కేసు తాళం వేస్తూంటే ఏవో చిన్న తెల్ల పేకట్లు కనిపించాయి - సాంపిల్స్ అన్నాడు- కాబోలనుకుంది - బ్యాంక్ పాస్ పుస్తకం ఖాతాలో లక్ష కనిపించినపుడు - బోనస్ అన్నాడు - నమ్మశక్యంగా అన్పించకపోయినా మరేయితర ఆలోచన లేక నిజం అనుకుంది. ఓడలు బండ్లు అవడం అంటే ఇదే అనుకుంది. మనిషి డబ్బుయితే సంపాయిస్తున్నా ఎప్పుడూ ఏదో టెన్షన్‌లో వుండేవాడు - యింటి పట్టున వుండేదే తక్కువ - పై ఊర్లకి కూడా వెడ్తున్నాననేవాడు. ఓ మాట మంతి నవ్వు ఏం లేదు. ఏమన్నా అంటే ఆఫీసు పెట్టిన టార్గెట్ అందుకోవాలి, కష్టపడాలి అనేవాడు - సరే ఏదో అతని ప్రాబ్లమ్స్ అతనివి అనుకొని సరిపెట్టుకుంది. బాబు స్కూల్లో జాయిన్ అయ్యాడు - రోజంతా ఖాళీ అని కాలక్షేపం కోసం, అయినా అవసరంలో ఆదుకున్న ఉద్యోగాన్ని వదులుకూడదనుకుంది. ఓ ఏడాది గడిచి కష్టాలు పాతకథలయ్యాయి అనుకునే వేళకి ఓ రోజు శ్రీరాం స్కూటర్ ఆక్సిడెంట్‌లో దెబ్బలు తగిలి ఆస్పత్రిలో వున్నాడని తెలిసి పరిగెత్తింది. చేయి విరిగింది, మిగతావి చిన్న దెబ్బలే - అసలు దెబ్బ అది కాదు. ఆ ఏక్సిడెంట్‌లో అతని బ్రీఫ్‌కేస్ కిందపడి బద్దలయి పేకట్లన్నీ రోడ్డుమీద చిందర వందరగా పడ్డాయి. పోలీసులు వచ్చారు - అవి ఏ కెమికల్ శాంపిల్స్ కావు బ్రౌన్ షుగర్, చరాస్ లాంటి మాదకద్రవ్యాలు - లక్షల ఖరీదు చేసే పాకట్లు - శ్రీరాం ఆరాకెట్ మనిషి అని తెలియగానే అరెస్ట్ చేశారు. ఆస్పత్రినించి డిస్చార్జ్ చేయించి జైల్లో పెట్టారు. అతను కోలుకున్నాక చిత్రహింసలు పెట్టారు. ఆరాకెట్ గురించి, ఆ ముఠాలో మిగతావారి పేర్లు చెప్పమని - ఓర్చుకోలేని స్థాయికి తెచ్చారు - తనకి బ్రీఫ్‌కేసు ఫలానా పాన్‌షాపు అందిస్తుందని అది వారు అందివ్వమన్నచోటకి అందించడం తప్ప ఏం తెలీదని చెప్పాడు. పాన్‌షాపువాడు - వాడికి ఆ బ్రీఫ్‌కేసు అందించే మనిషి, శ్రీరాం అందించేచోట్ల మాటేసి దొరికినంత మందిని పట్టుకున్నా అసలు కీలకమైనవారెవరిని పట్టుకోలేకపోయారు - శ్రీరాంకి మిగతా యిద్దరు ముగ్గురికి రెండేళ్లు కఠినకారాగార శిక్ష పడింది. తమ పరువు, మర్యాద నడివీధికెక్కాయి. తలెత్తుకోలేని స్థితి. జైల్లో శ్రీరాం కుళ్లి కుళ్లి ఏడుస్తూ చెప్పాడు. ఉద్యోగం లేకుండా తిరిగే తనకి పాన్‌షాపతను వాళ్లకి చెప్పి ఈ ఉద్యోగం యిప్పించాడని మొదట తనకసలు వాళ్లు బ్రీఫ్‌కేసు అందచేయడం తప్ప ఏ విషయం చెప్పలేదు. ఇది చాలా సుళువైన పని అని జీతం ఐదువేలని అనగానే ఎగిరిగంతేసి వప్పుకున్నాడు. తీరా పని మొదలుపెట్టాక తనుచేస్తున్న పని గురించి, ఫోన్లు చేసి చెప్పి, మాట బైటికి పొక్కరాదని, ఏ నాడయినా పట్టుపడితే ఎవరి పేరు చెప్పరాదని చెపితే చావు భయం అని నాకు తీసుకోవల్సిన జాగ్రత్తలు చెప్పారు. ఆరోజునించి తనలో మధనపడటం ప్రారంభమైనా డబ్బు వదులుకొని మళ్లీ రోడ్డున పడాలన్న ఆలోచన తనని కట్టేసిందని ప్రతిక్షణం ఎవరికి దొరికిపోతానో అన్న భయంతో జీవించానని విలపించాడు. ఇదంతా మీకోసం అన్నాడు. తను ప్రిన్సిపల్స్‌కి, నీతి, నియమాలకి కట్టుబడే మనిషి అని తెలుసు అతనికి - మాడి చచ్చినా తప్పుడు పనికి వప్పుకోదని తెలిసి తననించి యిదంతా దాచి తలెత్తుకోకుండా చేసిన అతన్ని క్షమించలేకపోయింది ఆరోజు నించి యీరోజువరకు. అంతటితో ఆగకుండా పోలీసులు తనమీద కూడా నిఘా వుంచడం, తన రాకపోకలు గమనించడం, రవి ఫ్రెండ్సు పేపరులో పడిన తండ్రి ఫోటో వార్త పిల్లలు అనడం తనే దోషి అన్నట్టు ప్రవర్తిస్తే ఆ చిన్న మనసు ఎంత గాయపడిందో తనకి తెలుసు - అ సమయంలో ఆదుకున్నది తను పనిచేసే స్కూలు స్టాఫ్ - తన ఉద్యోగం తీసేయచ్చు - పొమ్మనచ్చు - కాని సానుభూతితో పరిస్థితి అర్థం చేసికొని ఔదార్యం చూపడంతో తను బతికిపోయింది. ఆ యిల్లు, వాకిలి, ఆ డబ్బు అన్నీ వదులుకుని మళ్లీ ఓ ఒంటరి గదిలో పిల్లాడిని పెట్టుకుని జీవిస్తూ పాత జ్ఞాపకాలు తుడిచేసుకోవాలని ప్రయత్నిస్తూంటే - యిప్పుడు మళ్లీ తన సమస్య మొదటికి వచ్చింది. ఓ పక్క శ్రీరాం మీద సానుభూతి, మరోపక్క ఇలాంటి సంబంధాలు పెట్టుకున్న అతనికి మునుముందు ఏమన్నా సమస్యలుంటాయా! పోలీసుల దృష్టిలో పడ్డ అతన్ని ఏ సంఘటన జరిగినా బాధ్యుడిని చేసి హింసించవచ్చు - ఎదుగుతున్న పిల్లాడు! ఎడతెగని ఆలోచనలు!

* * *

"మీకు యిదివరకే చెప్పాను యింక మనిద్దరి మధ్య ఏ సంబంధం వుండదని మళ్లీ నాదగ్గరకెందుకొచ్చారు?" తీక్షణంగా అంది.

"ప్లీజ్ లలితా అలా అనకు, ఈ రెండేళ్లలో నేననుభవించిన నరకం నీకర్థం కాదు - నేను ఎలాంటి చిక్కుల్లో యిరుక్కున్నానో జైలుకెళ్లాకగాని అర్థం కాలేదు."

"స్వయం కృతాపరాధం...." లలిత తిరస్కారంగా అంది.

"నిజమే. కాని ఎందుకోసం, ఎవరికోసం చేశాను లలితా యిదంతా - మీకోసం - మిమ్మల్ని సుఖపెట్టడం కోసం."

"ఆపండి, యిలాంటి అవినీతి, పాపపు పనులు చేసి సంపాదించమని నేనెప్పుడూ మిమ్మల్ని కోరలేదు. ఇంతింత డబ్బు ఏ కంపెనీ యిస్తుంది. యింత మొదట్లో అని నాకెన్నిసార్లు అనుమానం వచ్చి అడిగాను మిమ్మల్ని. సేల్స్‌మేనేజర్లకిలా ఏడాదికి లక్షలు వస్తాయా అని గుచ్చి అడిగితే తిట్టారు. పక్కదారిలోకి వెళ్తున్నారేమోనని అనుమానం వచ్చి నిలేస్తే అంతా భ్రమ అని కొట్టిపారేసి నమ్మించారు. న్యాయంగా సంపాదించితే పరవాలేదు యిదేమన్నా అక్రమార్జన కాదు కదా అంటే ఛా, ఛా లేదంటూ అబద్ధాలాడారు - ఉద్యోగం లేనపుడైనా నాలుగు ట్యూషన్స్ చెప్పండి బతకడానికి అన్నాను గాని మీకుద్యోగం లేదని నేను సాధించినా - సుఖాల కోసం పక్కదారులు

తొక్కమని నేనడగలేదు - మీకు తెలుసు నేనిలాంటివి ఆమోదించనని -" విసురుగా అంది.

"అందుకే భయపడి నీకు చెప్పలేదు. తెలిస్తే వద్దంటానని భయం - నీమీద ఆధారపడి ఎన్నాళ్లు బతకమంటావు. నీవు తెచ్చే పదిహేను వందలకే మన బతుకులు ఎలా తెల్లారుతాయనుకున్నావు. లలితా ముందాలోచన లేక కేవలం డబ్బుకోసం చేశాను తప్ప నేనిలాంటివాడిని కానని నీకు తెలియదా -

"అవునండి, అంతా డబ్బుకాశపడే యిలాంటి వాటిల్లో యిరుక్కుంటారు. ఆ డబ్బు వస్తున్నకొద్దీ యింకా పాపాల్లోకి పాతుకుపోతారు. శ్లేష్మంలో యీగలా బయటపడతారు. మీ బలహీనతలని కనిపెట్టి యిలాంటివి చేయిస్తారు - చదువుకొని.

"ఎన్నో చూసిన మీరు యింత సుళువుగా యిలాంటి వలలో చిక్కుకున్నారంటే మీదెంత వీక్ మైండో తెలుస్తుంది - డబ్బెరగా చూపిస్తే ఎంతకన్నా తెగించే రకాలు మీరు.

"లలితా, ప్లీజ్ చచ్చిన పాముని యింకా చంపకు - యీ రెండేళ్ల నరకం నన్ను మార్చింది - నమ్ము నన్ను. జీవితంలో డబ్బుకంటే మానవ సంబంధాలే ఎక్కువని అర్థం అయింది. అందుకే నీ దగ్గరకి కాక యింకెవరి దగ్గిరకి వెడ్తాను, యింక నేనిలాంటి వాటిలో తల దూర్చను, ప్రామిస్ - నిరుద్యోగిగా నీ సంపాదన మీద ఆధారపడి బతకలేక యిలాంటి పనికి పాల్పడ్డాను అర్థం చేసుకో-"

"నిరుద్యోగులు, ఉద్యోగాలు పోయినవారు, డబ్బులేనివారు అంతా ఇలా పెడదారిబట్టి మాఫియా గ్రూపులు, తీవ్రవాద గ్రూపులు, నక్సలైట్లు, హింసాకారులుగా మారితే దేశం ఏమయిపోతుందా అని ఆలోచించాలి ఒక్క క్షణం - యిప్పటికే అవినీతి, హింస ఎంత పెరిగిందో......" అసహనంగా అంది.

"అబ్బ లలితా నీతులు చెప్పకు - పరిస్థితుల ప్రభావం మనిషిని బలహీనుడ్ని చేస్తుంది అన్నది తెలియదా- ఓసారి బలహీనపడిన వ్యక్తిని క్షమతో అర్థం చేసుకోవడం పోయి మాటలతో చంపడం ఏం సంస్కారం అనుకుంటున్నావు - మీ ఆడవాళ్లకి 'క్షమయాధరిత్రి" లాంటి బిరుదులు యిచ్చారు, అందుకైనా నన్ను క్షమించు, జరిగింది మర్చిపో, కొత్త జీవితం ఆరంభిద్దాం-" ఆశగా చూశాడు.

"హు' - క్షమయాధరిత్రి' ఆధరిత్రి పెచ్చుమీరిన పాపపంకిలాన్ని, హింసాకారుల్ని, దౌర్జన్యపరుల్ని మోయలేక గుండె బద్దలయి భూకంపాలు, ధరిత్రి వేదన కన్నీటిరూపంలో వరదలుగా ముంచెత్తుతున్నాయని గ్రహించండి - ఎవరెన్ని తప్పుడు పనులు చేసినా ఆడది కరిగిపోయి క్షమించేస్తుందని తెలిసే మీమగవాళ్లలా ఎన్నిరకాల తప్పుడు పనులైనా చేస్తారు. జరిగింది నేను మర్చిపోయినా లోకం మర్చిపోతుందా! నేపడిన అవమానం, హింస, లోకులమాటలు అన్నీ మర్చిపోలేను, కాని జనం మీరు జైలుకెళ్ళొచ్చిన మనిషిని మరిచిపోరు- మీకింక రేపెవరు ఉద్యోగం యిస్తారు. ఎక్కడ యిలాంటి నేరాలు జరిగినా పోలీసుల అనుమానం ముందు మీమీదే ఎప్పటికీ వారి నిఘా మీమీద వుంటుంది! అన్నింటిని మించి యీ మాఫియాగ్రూపులు యీ అండర్‌వరల్డ్ కింగ్‌లు మిమ్మల్ని అంత సుళువుగా వదులుతారా! యివన్నీ మీరు ఆలోచించారా- యీ వాతావరణంలో పెరిగే రవి ఏమవుతాడు - ఎలా తయారవుతాడో యిప్పటికే కాస్త జ్ఞానం వచ్చిన వాడు మీ గురించి నలుగురూ నానారకాలుగా అనుకుంటుంటే విని వాడి ఫీలింగ్స్ ఎలా వుండేవో అర్థం చేసికోండి".

శ్రీరాం తలదించుకున్నాడు - అతన్ని చూస్తే జాలి ఓ పక్క - భవిష్యత్తు ఎలా వుంటుందోనని ఓ పక్క అనుమానం - ఏది నిర్ణయించుకోలేని స్థితి ఆమెది. 'మమ్మీ' ఆడుకొని వచ్చిన రవి తండ్రిని చూసి భయంగా తల్లి వంక చూశాడు. శ్రీరాం మొహం కొడుకుని చూసి విప్పారింది! "రవీ, డాడిని మర్చిపోయావా, రానాన్నా' చేతులు చాచి అన్నాడు ప్రేమగా. రవి బితుకు బితుకు చూస్తూ తల్లి వెనకకి వెళ్లి నిల్చున్నాడు. "చూశారా, వాడు మిమ్మల్ని చూసి ఎలా భయపడ్తున్నాడో-" "మమ్మీ డాడీ యిక్కడే వుంటారా! తల్లి చెవిలో గుసగుసలాడాడు" "అవును రవీ మళ్లీ మనం అంతా చక్కగా హాయిగా వుందాం".

అది విన్న శ్రీరాం, "రా నాన్నా, నేనంటే భయమెందుకు, మీడాడిని-"

"మమ్మీ డాడిని వెళ్లిపోమను, యిక్కడొద్దు, మా ఫ్రెండ్సంతా డాడి గురించి అసహ్యంగా మాట్లాడుతారు-" శ్రీరాం మొహం మ్లానమయింది. ఎనిమిదేళ్లకొడుకు కూడా తనని అంగీకరించలేదన్నది అతనికి అర్థమైంది. "రవీ, అలా అనద్దమ్మా, డాడి సారి చెప్తున్నారుగ - పాపం మనడాడి - ఎక్కడికి పోతారు చెప్పు, నీవు ఏదన్నా తప్పు చేస్తే కోపగిస్తాను, కొడ్తాను గాని నిన్నింట్లోంచి పొమ్మంటానా-" కొడుకుతో అనునయంగా అంది. "డాడి పెద్దవాళ్లయి అలాంటి పని ఎందుకు చేయాలి!" పాయింటు లేవదీశాడు. "సారీ రవీ, తప్పు చేశాను తెలియక, డబ్బు లేదని, నిన్ను మంచి స్కూలుకి పంపాలని, మంచి బట్టలు కొనాలని, మనం అంతా సుఖంగా వుండాలని చేశా - యింక ప్రామిస్, గుడ్ బాయ్ అయిపోతాను!"

రవి అపనమ్మకంగా తల్లి వంక చూశాడు - లలిత ఒక్క క్షణం ఆలోచించింది. ఆమె ఆలోచనలో పడడం చూసి శ్రీరాంకి కొంచెం కోపం వచ్చింది.

"లలితా, మనం యింకా భార్యాభర్తలమే అన్న విషయం మర్చిపోకు-" కాస్త అసహనంగా అన్నాడు - తను బతిమాలిన కొద్దీ ఆమె బెట్టు చేస్తుందని కోపం వచ్చింది. లలిత చివుక్కున తలెత్తింది. "అంటే మీ హక్కుల గురించి జ్ఞాపకం చేస్తున్నారా?"

"అదికాదు లలితా, భార్యాభర్తల సంబంధం అంత తొందరగాపోదు అని గుర్తు చేస్తున్నాను. రవికి తండ్రిగా నాకీ హక్కు వుందని మరిచిపోకు-"

"ప్లీజ్, మీరివాళ్టికి వెళ్లండి- నేను ఆలోచించుకోవాలి, నాకు కాస్త టైమ్ కావాలి. భవిష్యత్తులో ఎలాంటి యిబ్బందులు తలెత్తుతాయోనని నాకు భయంగా వుంది. నన్నాలోచించుకోనీయండి-" నిష్కర్షగా అంది - ఆమె మొహం చూసి "యింట్లోంచి పోయి యీరాత్రి ఎక్కడుండాలని నీ ఉద్దేశం - కట్టుబట్టలతో జైలుకెళ్లిన వాడిని, యిప్పుడు ఎక్కడికి వెళ్లాలి నేను, లలితా, నీవింత మారిపోయావని అనుకోలేదు - జైలునించి వస్తే మొగుడు తిరిగి వచ్చాడని సంతోషించాల్సింది పోయి యిలా అనడం నీకే చెల్లింది"- విస విస యింట్లోంచి వెళ్లిపోయాడు శ్రీరాం.

ఆ రాత్రి క్షణం నిద్రపోలేకపోయింది లలిత. కట్టుకున్న భర్త ఓ పక్క తనెత్తుకోవాల్సిన బరువు బాధ్యతలు ఓ పక్క - ఉద్యోగం లేని భర్తని యింట్లో పెట్టుకుని సంసారం లాగాలంటే యిదివరకటి క్షోభ గుర్తు వచ్చింది - ఎన్నాళ్లిలా అతన్ని తను భరించగలదు - వెధవ పని చేసి జైలుకెళ్ళి వచ్చిన వాడిని యింట్లో పెట్టుకుని సంసారం లాగగలదా - అలా అని కట్టుకున్నవాడిని నిర్దాక్షిణ్యంగా వద్దు అని ఎలా చెప్పడం - మానవత్వానికి, భవిష్యత్తు పట్ల భయంతో ఆమె మనసు ఊగిసలాడింది.

* * *

ఆమె సమస్యకి భగవంతుడే పరిష్కారం చూపాడు - తెల్లారి తలుపు తీయగానే గుమ్మంముందు శ్రీరాం శవం పడుంది. వంటినిండా కత్తిపోట్లతో - పోలీసులకి దొరికి, తమ ఆచూకి తెల్పినందుకు అతను బతికివుండడం తమకు క్షేమం కాదని మట్టుబెట్టినట్టు చీటి రాసి పెట్టి మరీ వెళ్లారు - బలహీనతకి బలైపోయిన శ్రీరాంని చూసి విచలితురాలైపోయింది - రాత్రి ఆశ్రయం యిచ్చివుంటే యీగతి పట్టేది కాదేమోనన్న భావం ఓ క్షణం ఆమెని కుదిపినా, యీరోజు కాకపోతే యింకోరోజు, యిక్కడ కాకపోతే యింకెక్కడన్నా యిది జరిగేదే అన్న సత్యం తట్టి తనని తాను ఓదార్చుకుంది.